

# ఆ పాత పాట మధురం

## రాజా



నెలనెలా..ఒక పాత సినిమాలోని పాటల సంగీత సాహిత్య విశ్లేషణ

# కన్యాశుల్కము

**తెలుగు సాహితీ చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకున్న నాటకం గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం**

ఈ నాటకాన్ని తెరకు అనుగుణంగా మలుచుకునే విషయంలో సర్వజనామోద ముద్ర పడేలా రూపొందించారానాడు. ఈ చిత్రానికి దర్శకుడు పి. పుల్లయ్య. 'దేవదాసు' చిత్రం ద్వారా ఈనాటికీ తన బ్యానర్ గుర్తుండేలా చేసుకున్న డి.యల్.నారాయణ ఈ చిత్రానికి నిర్మాత. రచన సదాశివ బ్రహ్మం కాగా పాటలను సదా శివబ్రహ్మం, దేవులపల్లి, మల్లాది, సముద్రాల రాశారు. ఇవి కాక బసవరాజు అప్పారావుగారి నాగుల చవితి గీతం, గురజాడ అప్పారావుగారి పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కథ, శ్రీ శ్రీ రాసిన ఆనందం అర్ణవమయితే గేయం పాటలుగా ఉన్నాయి. ఘంటసాల సంగీత దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఈనాటికీ మరిచిపోలేని రెండు పాటలివి.

ఆనందం అర్ణవమైతే అనురాగం అంబరమైతే ||ఆనందం||
అనురాగపు టంచులు చూస్తాం ఆనందపు లోతులు తీస్తాం ||ఆనందం||
నీ కంకణ నిక్వాణంలో నా జీవన నిర్వాణంలో
నీ మదిలో డోలలు తూగి నా హృదిలో జ్వాలలు రేగి..
నీ తలపున రేకులు పూస్తే నా వలపున బాకులు దూస్తే (2)
మరణానికి ప్రాణం పోస్తాం స్వర్గానికి నిచ్చెన వేస్తాం (2) ||ఆనందం||

ఆ....
హసనానికి రాణివి నీవై వ్యసనానికి బానిస నేనై
విషమించిన మదీయ ఖేదం కుసుమించిన త్వదీయమోదం
ఆ...
విషవాయువులై ప్రసరిస్తే విరితేనియలై ప్రవహిస్తే
ప్రపంచమును పరిహసిస్తాం భవిష్యమును పరిపాలిస్తాం (2) ||ఆనందం||

శ్రీ శ్రీ 'మహాప్రస్థానం'లోని 'ఆనందం అర్ణవమైతే' గేయాన్ని ఈ చిత్రం కోసం పాటగా మలుచుకున్నారు. సుశీల పాడిన ఈ పాటను సావిత్రి ప్రధాన పాత్రధారిణిగా అభినయించింది. శంకరాభరణంలోని స్వరాలను స్కేలుగా తీసుకుని అక్కడక్కడ ప్రతి మధ్యమాన్ని (మ అనే స్వరంలో) కైశిక నిషాదాన్ని (ని అనే స్వరంలో) కూడా ఉపయోగిస్తూ పాటను స్వరపరిచారు ఘంటసాల. గేయాన్ని

గీతంగా మలచటంలో కొన్ని ఇబ్బందులున్నాయి. అందులోను బహుళ ప్రచారంలో ఉన్న గేయమైతే అవి ఇంకా జటిలం అవుతాయి. వాటన్నిటినీ ఘంటసాల ఎలా అధిగమించారో ఈ ట్యూన్‌ని నాలుగైదు సార్లు వింటే తెలుస్తుంది. ఇదొక ఎత్తు ఖంగుమంటూ మ్రోగే సుశీల గొంతులోని ఫ్రెష్‌నెస్ ఒక ఎత్తు.

---

చిటారు కొమ్మనూ...
చిటారు కొమ్మను మిఠాయి పొట్లం చేతి కందదేం గురుడా
వాటం చూసి వడుపు చేసి వంచర కొమ్మను నరుడా ||వాటం|| ||చిటారు||
పక్కన మెలగే చక్కని చుక్కకు
చక్కిలిగింత లేదేం నరుడా
కంచు మోగక కనకం మోగదు
నిదానించరా నరుడా ||చిటారు||
వాటం చూసి వడుపుచేసి
వంచర కొమ్మను నరుడా
పండంటి పిల్లకు పసుపు కుంకం
నిండుకున్నదేం గరుడా
దేవుడు చేసిన లోపాన్ని
నువ్వు దిద్దుకు రారా నరుడా ||దేవుడు||
కొద్దిగ హద్దుమీరరా నరుడా ||చిటారు||
విధవలందరికి శుభకార్యాలు
విధిగా చెయ్ మంటావా ||విధవ||
అవతారం నీదందుకోసమే.....
ఆరంభించర నరుడా
వాటం చూసి వడుపుచేసి
వంచర కొమ్మను నరుడా ||చిటారు||

'కన్యాశుల్కం' కథ పల్లెటూరి వాతావరణంలో ఎక్కువగా జరుగుతుంది కనుక పల్లెపట్టు ప్రాంతంలో తరచు వినిపించే రాగం అయితే బావుంటుందన్న ఆలోచన ఈ పాట స్వరరచనలో కనిపిస్తుంది. సాధారణంగా పల్లె ప్రాంతాల గీతాల్లోనూ తత్వ గీతాలలోనూ హరి కాంభోజి రాగాన్ని, యదుకుల కాంభోజి రాగాన్ని ఉపయోగించడం జరుగుతూ ఉంటుంది. ఈ పాటకు సంబంధించి యదుకుల కాంభోజి రాగచ్ఛాయలే ఎక్కువగా ఉన్నాయని చెప్పొచ్చు. ఈ రాగాన్ని ఈ ధోరణిలో ఘంటసాల తరువాతి రోజుల్లో చాలాసార్లు ఉపయోగించారు. మాయాబజార్ (1957) చిత్రంలో 'దయచేయండి దయచేయండి' పాటని, 'జయం మనదే' (1956) చిత్రంలో 'చిలకన్న చిలకవే బంగారు చిలకవే' పాటని, ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుని ఆలపించుకోండి - ఆ తరువాత ఆ పాటల ఎత్తుగడ, ఈ పాట ప్రారంభం అవటానికి ముందు వచ్చే వాద్య సంగీతంతో పోల్చుకోండి. మూడు పాటలూ ఎంత దగ్గరగా ఉన్నాయో గమనించవచ్చు.

ఇక గాయకుడిగా ఘంటసాల చేసే పరకాయ ప్రవేశం గురించి ప్రత్యేకించి చెప్పనక్కరలేకపోయినా కొన్నిటిని పునశ్చరణ చేసుకుంటే మన సంస్కారం మరింత మెరుగుపడుతుంది. గిరీశం పాత్రను గురజాడ అప్పారావుగారు అప్పటి దేశకాలమాన పరిస్థితులకు అనుగుణంగా, వ్యంగ్య ధోరణిలో సృష్టించారు. ఆ పాత్రకుండే కొన్ని బలహీనతలు, వాటిని అతి చమత్కారంగా సమర్థించుకోగలిగిన మేధో సంపద, వాటన్నిటికి తోడుగా వయసు హుషారు - ఇవన్నీ గాయకుడి గళంలో కూడా ప్రతిఫలించాలి. అప్పుడే లోపభూయిష్ఠమైన కొన్ని కట్టుబాట్లను తమ స్వార్థం కోసం అతిక్రమించమంటూ ప్రవచించే ఇటువంటి పాటలకు అంతులేని ఆదరణ లభిస్తుంది. పాత్ర స్వభావంతో పాటు పూర్వాపరాలను కూడా పూర్తిగా ఆకళింపు చేసుకున్న వ్యక్తి కావటంచేత ఘంటసాల వాటిన్నిటినీ సంగీత దర్శకుడిగానే కాకుండా గాయకుడుగా కూడా సంపూర్ణ న్యాయంతో ప్రతిఫలించేట్టు చూసుకున్నారీ పాటలో. కావాలంటే గిరీశం పాత్ర స్వభావం గురించి మీలో మీరు తర్కించుకుని ఈ పాటను విని చూడండి. ఘంటసాల చేసిన ప్రాణ ప్రతిష్ఠ ఎటువంటిదో తెలుస్తుంది.

పైన ఉదహరించిన ప్రాణప్రతిష్ఠ జరగడానికి అవసరమయ్యే జీవాన్ని, చైతన్యాన్ని తన అక్షరాల ద్వారా మల్లాది రామకృష్ణశాస్త్రిగారు సంక్రమించేట్టు చేశారని చెప్పాలి సాధారణంగా మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రచనలు మేధోవర్గానికి పట్టినంత త్వరగా పాటకజనానికి

పట్టవు. కానీ ఈ పాటకి సంబంధించినంతవరకు మాత్రం ప్రతి పదానికీ అర్థం తెలియకపోయినా, విశ్లేషించుకోవటం తెలియకపోయినా తమకు కావలసినదేదో పూర్తిగా లభించినంతగా ఆ వర్గం వారు కూడా సంతోషించారు. కన్యాశుల్కం నాటకంలో ఒకచోట గిరీశం అంటాడు - భగవంతుడు నాకు ప్రత్యక్షమైతే... నువ్వు నన్ను డిపెండెంటుగా పుట్టించావా, ఇండిపెండెంటుగా పుట్టించావా అని అడుగుతాను. డిపెండెంటుగా పుట్టించానంటాడనుకో - మరింకేం... నేనేం చేసినా నువ్వు చేయిస్తున్నట్టే లెక్క అంటాను. ఇండిపెండెంట్‌గా పుట్టించాడనుకో అయితే నా ఇష్టం వచ్చినట్టు చేసుకుంటా నువ్వెవడివి అడగడానికి అంటాను. ఇదిగో అలా ఉంటుంది గిరీశం ధోరణి! మరి అలాంటి వాడు కనుకనే - కంచు మోగక కనకం మోగదు (పూర్వాశ్రమంలో సంబంధం ఉన్న ఆడవాళ్ళలా బుచ్చెమ్మ అంత త్వరగా పడదుగా మరి) నిదానించరా నరుడా అని తనకి తాను సర్ది చెప్పుకోగలడు, దేవుడు చేసిన లోపాన్ని నువ్వు దిద్దుకురారా నరుడా అంటూ సమర్థనీయంగా 'అహంభావించగలడు', 'కొద్దిగ హద్దు మీరరా నరుడా' అంటూ రెచ్చిపోడానికి రంగం సిద్ధం చేసుకోగలడు. విధవలకు శుభకార్యాలను విధిగా చెయ్యడం కోసమే ఈ అవతారం కనుక షురూగురూ అంటూ తన వాదనకు తగ్గ సామాగ్రిని సమగ్రంగా సిద్ధం చేసేసుకోగలడు. అటువంటి గిరీశాన్ని యధాతథంగా, అక్షరాలా - 'స అక్షరాత్కరింప' చేశారు మల్లాది రామకృష్ణశాస్త్రి ఈ పాట ద్వారా.

నిర్మాతకి, దర్శకుడికి, రచయితకి, సంగీత దర్శకుడికి, గాయనీగాయకులకి, నటీనటులకి, పాత్ర(ల) పట్ల అంతటి అవగాహన ఉండేది ఆ రోజుల్లో. అందుకు అవసరమయ్యే హోమ్‌వర్క్ కూడా ఎవరికి వారు చేసుకునేవారు. అవసరమైతే చర్చించేవారు. అందుకే ఈనాటికీ ఆ పాటలను మరీ మరీ తలచుకుంటున్నాం.

---

*ఆ నాటినుంచీ ఈ నాటి వరకూ వచ్చిన, వస్తున్న సినిమాల్లోని పాటల సాహిత్యం గురించీ, సంగీతం గురించీ సాధికారకంగా, సవివరంగా, సరళంగా, సమగ్రంగా విశ్లేషించగల ఒకే ఒక్క సీనియర్ మోస్ట్ జర్నలిస్ట్ రాజా. 'కౌముది' పాఠకులకోసం ఆయన వ్యాసాలని నెలకొకటి అందిస్తున్నాం. ఒక్కసారి నిన్నటి తరం పాటల్ని నెమరు వేసుకుందాం.. ఆ నాటి మధుర స్వరాలని మరోసారి గుర్తు తెచ్చుకుందాం.*

*ఇ-మెయిల్ ఎడ్రసు:* **raja.musicologist@gmail.com**